# తీరంలో దొంగలు పడ్డారహో.....

**- పుస్తక పరిచయం**

నిజమే.... వాళ్లు ఒట్టి దొంగలు కూడా కాదు. గజదొంగలు. ఇంటిదొంగలతో మిలాఖతయిన విదేశీ ఘరానా దొంగలు. రూపాయి పెట్టుబడి పెట్టి డాలరు వట్టుకుపోదామని చూస్తున్న దోపిడీ దొంగలు. మన కళ్లెదుటే, పట్టపగలే ప్రభుత్వ అండదండలతో జరుగుతున్న ఈ నిలువు దోపిడీ 'నీలి విప్లవం' మేలిముసుగు వెనక ఎలా దాక్కుని వుందో తెలియజెప్పే పుస్తకమే 'తీరంలో దొంగలు పడ్డారహో.. దొంగల తరమండహో...'

ఆంధ్రరాష్ట్ర తీరమంతటా విచక్షణా రహితంగా సాగుతున్న రొయ్యల పెంపకంపై యిది 'విమర్శనాత్మక పరిశీలనా వ్యాసం'. అన్ని పంటల్లోకి తీర ప్రాంత రైతుకు అత్యధిక లాభాలు తెచ్చిపెట్టే బంగారు గుడ్ల బాతుగా ప్రచారమవుతున్న రొయ్యల పెంపకం స్థానికుల జీవనోపాధికి, ప్రకృతికి, పర్యావరణానికి ఎంతటి తీవ్రహాని కలుగజేస్తున్నదో రచయిత సత్యకాముడు చాలా విపులంగా తెలియజేశారు.

'రొయ్యల రాజధాని' గా పేరుబడ్డ నెల్లూరుజిల్లాను ప్రధానంగా తీసుకుని ఆయన అన్ని పరిశ్రమల్లాగానే యిదీ దళిత వర్గాలను ఎలా దోపిడీ చేస్తోందో, వాళ్ళ పొట్ట ఎలా కొడుతోందో విశ్లేషించి చెప్పారు.

* * *

టైగర్ రొయ్యలకు అంతర్జాతీయ మార్కెట్‌లో విపరీతమైన గిరాకీ వుంది. తైవాన్, ఇండోనేషియా, థాయిలాండ్ దేశాలలో వీటి పెంపకం నిన్నమొన్నటి దాకా జోరుగా సాగింది. అంటువ్యాధులు, తదితర అనేక సమస్యల కారణంగా తైవాన్‌లో, థాయిలాండ్‌లో వీటిపెంపకాన్ని నిషేధించారు. మరో దేశం కోసం వేసిన వలలో మన దేశం చిక్కింది. తీరం పొడవునా వున్న చవుడు భూములలో రొయ్యలు పెంచి, విదేశీ కంపెనీలకు అమ్మి, రెండు చేతుల్తో విదేశీ మారకద్రవ్యం సంపాదించవచ్చన్న ఉద్దేశంతో మన దేశం రొయ్యల పెంపకాన్ని ప్రోత్సహించనారంభించింది. దీనివల్ల ఎన్నిరకాల సమస్యలు తలెత్తాయో చెప్పలేం.

భూసంస్కరణల చట్టంతో ప్రారంభించి ఈ 'నీలివిప్లవం' ఎన్నో చట్టాలను ఉల్లంఘిస్తోంది. మిగులుభూములను అప్పగించకుండా కోర్టుద్వారానో యితరత్రానో వాటిని తమ అధీనంలోనే వుంచుకున్న భూస్వాములకు 223/87 జి. వో. వరంలా వచ్చింది. "గతంలో భూస్వాములు ఎందుకూ పనికిరావని భావించి భూగరిష్ట పరిమితి చట్టం కింద వదిలి వేసిన ఉప్పునీటి భూములు తీర ప్రాంతంలోనే అధికంగా వున్నాయి. ఉదాహరణకు నెల్లూరుజిల్లాలోని ముత్తుకూరు, విడవలూరు మండలాల్లోని దేవిరెడ్డి కోదండరామిరెడ్డి, వేణుంబాక రామిరెడ్డి అనే ఇద్దరు ఆసాముల భూములు సుమారు 2000 ఎకరాల పై చిలుకే వున్నాయి. ఇవన్నీ యిపుడు 'నీలివిప్లవం' పుణ్యమా అని తిరిగి ఆ భూస్వాముల కుటుంబాలకు వరాల వర్షం కురిపిస్తున్నాయి."

223/87 జి. వో. ప్రకారం రొయ్యల పెంపకానికి అనువైన భూముల్లో 60 శాతం మత్స్యసహకార సంఘాలకు, 20 శాతం నిరుద్యోగ స్వయం ఉపాధి సాంకేతిక నిపుణులకు, 20 శాతం ప్రగతిశీల వ్యాపార సంస్థలకు కేటాయించవలసి వుంటుంది. స్వల్ప పెట్టుబడితో సాగుచేయగలిగిన భూములను మొదటివర్గం వారికి, పది ఎకరాలకు మించకుండా రెండోవర్గం వారికి, వంద ఎకరాలకు మించకుండా మూడోవర్గం వారికి యివ్వాలని ఈ జి. వో. చెపుతుంది. 15 సంవత్సరాలకు ఒకేసారి, సంవత్సరానికి హెక్టారుకు 50 రూ. చొప్పున లీజుకి యిస్తారు. ఈ జి. వో. కింద నెల్లూరు జిల్లాలో యింతవరకు లీజుకిచ్చిన సుమారు 2000 ఎకరాలు ఎవరికి దక్కాయో తెలుసుకోవడం చాలా అవసరం.

12మంది 'ప్రగతిశీల' పారిశ్రామిక వేత్తలకు వందేసి ఎకరాల చొప్పున మంజూరు చేశారు. ఆ ప్రగతి శీలులెవరో చూడండి.

1. రాముడుపాలెంలో ఆర్విన్ మెరైన్ ప్రొడెక్ట్స్ (ఆదాల రాఘవరెడ్డి)
2. తాటిచెట్లపాలెంలో ఎం. నరేంద్రప్రసాద్ (జనార్ధనరెడ్డి బాకా పత్రిక 'జమీన్‌రైతు' వ్యవస్థాపక కుటుంబంలోని వ్యక్తి)
3. జార్జిమిజో అనే విదేశీ మిలాఖత్ కంపెనీ
4. చాముడ్ ప్రాన్‌కల్చర్ (జనార్ధనరెడ్డి బంధువు చంద్రశేఖరరెడ్డి)

## పర్యావరణానికి ప్రజలు శత్రువులా?....

విచ్చలవిడిగా అడవులలో సాగుభూమి కల్పిస్తే అడవులు నాశనం అవుతాయనేది వాస్తవమే. కానీ అటవీవాసులకు 'ప్రత్యామ్నాయ జీవన విధానం' చూపించాలని చట్టంలో రాస్తే సరిపోతుందా? ఆ ప్రత్యామ్నాయం ఎక్కడ ఉంది? ప్రత్యామ్నాయాలు కల్పించే ప్రయత్నాలు ఎక్కడ జరుగుతున్నాయి? నూతన ఆర్థిక విధానాల పేరిట ఉద్యోగాలు పెంచేబదులు తగ్గించే విధానం నడుస్తూ ఉంది. మరి అటవీప్రాంత గ్రామీణులకు ఏ ప్రత్యామ్నాయం చూపిస్తారు? భిక్షాటన, వ్యభిచారమా?

జీవిత అవసరాల కోసం అటవీ ఉత్పత్తుల మీద ఆధారపడడం తగ్గించుకోవాలనీ, తగ్గించుకోవడాన్ని ప్రోత్సహించాలనీ అంటున్నారు. బాగానే ఉంది. పరిశ్రమలు, వర్తకులు కలపకుబదులు లోహాలమీద, సింథెటిక్ సరుకులమీద ఆధారపడే ప్రయత్నం చేయొచ్చు. లేదా కలపను దిగుమతి చేసుకోవచ్చు. ఇవి రెండూ ఖరీదయిన ప్రత్యామ్నాయాలే. ఇవి పెట్టుబడిదార్లకు సాధ్యం అవుతాయి. గ్రామీణప్రజలు ఏ ప్రత్యామ్నాయాన్ని వెతుక్కోవాలి?

అడవులు పెంచాలి, గ్రామాలలో ఉన్న నిరుపయోగమైన బంజర్లలో కూడ చెట్లు బాగా పెంచి ప్రజల అవసరాలు తీరేటట్టు చూడాలి, పర్యావరణ సమతుల్యాన్ని కాపాడాలి అనేది మంచి ఆలోచనే. కానీ ఆ ఆలోచనకు ఈ ముసాయిదా ఇస్తున్న శాసన రూపం ప్రజలను పర్యావరణానికి శత్రువులు చేసి, అన్నినిర్ణయాలనూ సర్వాధికారాలనూ ప్రభుత్వం చేతిలో కేంద్రీకరించి అటవీ విధానాన్ని మరింత నిర్బంధపూరితం చేస్తుంది. దీనివల్ల దేశంలో అడవుల విస్తీర్ణం పెరుగుతుంది. పర్యావరణం పరిస్థితి మెరుగు పడుతుంది. పరోక్షంగా దానివల్ల ప్రజలకు కొంత మేలు కూడ జరుగుతుంది. కానీ ప్రత్యక్షంగా ప్రజలు చాలా హక్కులను, స్వేచ్ఛను జీవనాధారాన్ని కోల్పోతారు.

(ఈ వ్యాసం రాయడానికి కర్నాటక, మహరాష్ట్రలకు చెందిన అయిదు ప్రజాతంత్ర సంస్థలు ఉమ్మడిగా ప్రచురించిన పుస్తకం, All About Draft Forest Bill and Forest Lands అనే పుస్తకం ఉపయోగపడింది. పుస్తకం వెల 60 రూ॥లు. ప్రతులు పొందగల అడ్రసు Samaj Parivartana Samudaya, Asha Deep, Jayanagar Cross, Saptapur, Dharwad - 580001, Karnataka)

5. ఓరియంటల్ ఫుడ్ ఇంతస్ట్రీ
6. ఏడుగురి సీఫుడ్స్ (వై. ఎస్. రాజశేఖరరెడ్డి)
7. ఆర్విన్ ఫాక్ట్స్
8. అల్సా మెరైన్ అండ్ హార్వెస్ట్ (బాబర్‌సేఠ్)
9. శ్రావణ సీఫుడ్స్
10. మంజీర సీఫుడ్స్
11. శాంతి సీఫుడ్స్
12. అరుల్ సీఫుడ్స్

ఈ 1200 ఎకరాలు కాక మరో 870 ఎకరాలను మాత్రమే ప్రభుత్వం లీజుకిచ్చింది. జిల్లాలో మొత్తం 121 మత్స్యసహకార సంఘాలు వుండగా ఒకే ఒక దానికి 490 ఎకరాలు, 400 మందికి పైగా నిరుద్యోగ సాంకేతిక నిపుణులుంటే (నమోదయినవారు) 38 మందికి మాత్రమే పదేసి ఎకరాల చొప్పున 380 ఎకరాలు లీజుకిచ్చారు. "ఇందులోనూ పారిశ్రామిక వేత్తలకు మేలైన భూములిచ్చి వాటిని వారికి స్వంతం కూడా చేశారంటే, మిగిలిన కేటగిరీల వారికి కాగితాల మీద తప్ప చేతికి యింకా భూములు యివ్వలేదంటే ఈ యంత్రాంగం ఎవరి ప్రయోజనాలను నెరవేరుస్తుందో ఆలోచించండి".

మీసాల నీటిపులులు తెచ్చే డాలర్ల మోజులో పడి ప్రభుత్వం అటవీ చట్టాన్ని, వాతావరణ కాలుష్య నివారణ చట్టాన్ని, సముద్ర జలాల చట్టాన్ని....ఒకటేమిటి అడ్డమొచ్చిన ప్రతి చట్టాన్నీ ఉల్లంఘిస్తున్న దనడానికి ఈ పుస్తకంలో చాలా ఉదాహరణలున్నాయి.

-జాతీయ అటవీ విధానం ప్రకారం జిల్లాలో మూడోవంతు అడవిగా వుండాల్సి వుంటే ప్రస్తుతం నెల్లూరుజిల్లాలో 19. 17 శాతం మాత్రమే అటవీ ప్రాంతంగా వుంది. దీన్ని అభివృద్ధి చేయకపోగా తుఫాను, ఉప్పెనల్లాంటి ప్రకృతి వైపరీత్యాలకు నివారణగా 1977లో ప్రారంభించిన తీరప్రాంత రక్షిత వనాల పథకాన్ని (షెల్టర్ బెల్ట్) రొయ్యల కంపెనీలు సర్వనాశనం చేస్తున్నా ప్రభుత్వ యంత్రాంగం నోరు మెదపడం లేదు.

అల్లూరు మండలం కుర్రుపట్టపుపాలెం దగ్గర రాంకో ఆక్వా, బొమ్మిడాల, పవేరా హోటల్ (మద్రాసు) వారి కంపెనీలు, విడవలూరు మందలం లక్ష్మీపురం వద్ద ఆర్విక్ ఆక్వాఫామ్స్ ప్రైవేట్ లిమిటెడ్, రామచంద్రాపురంలో 'సిరాగ', వెంకటనారాయణపురంలో రాంకోఆక్వా, ముత్తుకూరు మండలం కృష్ణాపట్నంలో డి. సి. ఎల్. కంపెనీ, అనంతవరంలో ది వాటర్ బేస్ లిమిటెడ్ (థాపర్) కంపెనీ, తూపిలిపాలెంలో మాగుంట ఆక్వాఫామ్స్ కంపెనీ (ఒంగోలు ఎం. పి మాగుంట సుబ్బరామ రెడ్డిది) షెల్టర్ బెల్ట్ పథకం కింది చెట్లను నరికి, ఆ భూముల్ని ఆక్రమించుకుని, అందులో పెద్ద పెద్ద కట్టడాల్ని నిర్మిస్తున్నారు. ఫారెస్టు అధికారులు మౌవం వహించడం ఒక విచిత్రమయితే, జిల్లా కలెక్టరు, పోలీసు సూపరింటెండెంట్ దగ్గర వుండి ఈ పనులను పర్యవేక్షించతం మరో విచిత్రాతి విచిత్రం!

-వేల ఎకరాల్లో సంవత్సరం పొడుగువా ఉప్పునీరు నిల్వ వుంటే వాటి చుట్టుపక్కల 15 కి. మీ. పరిథిలో ఎలాంటి పంటలూ పండవు. మంచినీటి వనరులన్నీ ఉప్పునీటి జలాశయాలుగా మారిపోతాయి. పచ్చగడ్డి మొలవదు సరే తాటిచెట్లు కూడా మాడి నేలకూలుతున్నాయి. పశువులనైతే అమ్ముకోగలరు కాని మనుషులు మంచినీళ్లు లేకుండా ఎలా బతుకుతారు? రొయ్యల చెరువు తవ్వినవాడు నెల్లూరునుంచో, మద్రాసు నుంచో మంచినీళ్లు తెచ్చుకుని దాహం తీర్చుకుంటాడు కాని మిగతా ప్రజలందరూ నీటికోసం నానా తిప్పలు ఎందుకుపడాలి? తాటిచెట్లను గీసి కల్లు అమ్ముకువే గీతపని వారలు ఎందుకు వలసపోవాలి? మంచినీటి వనరుల్ని యింత భయంకరంగా కలుషితం చేస్తున్న రొయ్యల పెంపకందార్లమీద వాతావరణ కాలుష్య నివారణ బోర్డుకు యింత ప్రేమేమిటి? ఇది వాళ్ల పరిథిలోకి రాదనే అజ్ఞానంలో వున్నారా వాళ్లు?

-The territorial water, continental shelf Exclusive Economic Zone and other Maritime zones Act, 1976 అవి మనకు ఒక చట్టం వుంది. దీని ప్రకారం సముద్రతీరం మండి 12 నాటికల్ మైళ్ళ వరకు వున్న సముద్రజలాల మీద కేంద్రప్రభుత్వానికే అన్ని హక్కులూ వుంటాయి. ఈ ప్రాంతాన్ని భారత ప్రజల ప్రయోజనాలకే వినియోగించాలని,



పుస్తకంపేరు : తీరంలో దొంగలు పడ్డారహో....
నీలి విప్లవం మేలి ముసుగు
రచయిత : సత్యకాముడు
ముద్రణ : 1994
వెల : ఐదు రూపాయలు
కాపీలకు : 1. మణి బుక్‌స్టాల్, సండే మార్కెట్, నెల్లూరు -1
2. జి.ఆర్. అంబేద్కర్ అడ్వొకేట్, గౌతమ్ నగర్, నెల్లూరు - 3.

ప్రైవేట్ వ్యక్తులకుగాని సంస్థలకుగాని యివ్వాలంటే కేంద్రప్రభుత్వం అనుమతి తీసుకోవాలని, కేంద్రప్రభుత్వం కూడా స్థానిక ప్రజల జీవనానికి, శాంతి భద్రతలకు ఎలాంటి భంగం వాటిల్లదని భావించిన పక్షంలోనే తాత్కాలిక లీజు పద్ధతిపై అనుమతి యివ్వాలని ఈ చట్టం చెపుతుంది. దీని అమలుకు 'కోస్టుగార్డు' అనే ప్రత్యేక విభాగం వుంది, కొంత సైన్యం కూడా వుంటుంది.

మరి ఈ చట్టం, దాన్ని అమలుచేసే యంత్రాంగం, 'కోస్టుగార్డు', సైన్యం అన్నీ ఏమయ్యాయో గాని పైన చెప్పిన కంపెనీలు ఈ చట్టంలోని ప్రతి సెక్షన్‌నూ ఉల్లంఘిస్తున్నా వారిని నోరుతెరిచి యిదేమని ప్రశ్నిస్తున్న వాళ్లెవరూ లేరు. రొయ్యపిల్లల్ని ఏరుకుంటున్నారు, ఉప్పునీటిని మళ్లించుకుంటున్నారు, అనుమతి లేకుండా జెట్టీలు కడుతున్నారు, స్థానిక ప్రజల జీవనానికి భంగం కలిగించే విషయమైతే చెప్పనే అక్కరలేదు. చట్టం ప్రకారం వీరికి మూడేళ్ళ జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించవచ్చు.

-జలమార్గాల అభివృద్ధి పేరుకు ప్రభుత్వ పాలసీయే గానిరొయ్యల పెంపకం ప్రారంభమయ్యాక బకింగ్‌హామ్ కాలువకు పట్టినగతి ఏమిటో చూసి తీరాల్సిందే. వెల్లూరుజిల్లాలో ఈ కాలువ పొడవు 179 కి. మీ. దీనిలోని నీటిని పెద్దపెద్ద రొయ్యల కంపెనీలు అనుమతిలేకుండా వాడుకోవడమే కాక రొయ్యల చెరువుల్లోని మురుగు నీటిని సుఖంగా దీనిలోకి వదిలేస్తున్నారు. ఈ నీటిని తాగి అతిసార వంటి వ్యాధులు తెచ్చుకున్న గ్రామాలు చాలా వున్నాయి. ఈ కాలువమీద ప్రభుత్వం అనుమతి లేకుండా కనీసం నాలుగుచోట్ల ఓవర్‌బ్రిడ్జిల నిర్మాణం జరిగింది. రాముడుపాలెంలో జె. కె. రెడ్డి (నెల్లూరు ఎమ్మెల్యే), రామచంద్రాపురం వద్ద 'సిరాగ', 'రాంకో ఆక్వా' కంపెనీలు ఓవర్‌బ్రిడ్జిలను కట్టాయి.

## మనుషుల కంటే రొయ్యలు ముఖ్యమా?

అన్నిటికంటే ముఖ్యం ఈ పరిశ్రమ ఎన్నో లక్షలమంది జీవనోపాధిని పోగొడుతోంది. తీరం పొడవునా నివసించే పల్లె కారులు, పట్టెపుకాపులు, యితర దళిత కులాల వారికి చేపల వేటకు, యితర సంప్రదాయ వృత్తులకు అవకాశాలు బాగా తగ్గిపోయాయి. వారు రొయ్యల చెరువుల్లో లేదా కంపెనీల్లో రోజుకూలీలుగా మారిపోయారు. ఆ అవకాశమైనా కొద్దిమందికే. 'ది వాటర్ బేస్ లిమిటెడ్' (థాపర్ కంపెనీ) 275 ఎకరాల విస్తీర్ణంలో అవంతవరంలో సాగిస్తున్న రొయ్యల పెంపకానికి పెట్టుబడేమో 42. 5 కోట్ల రూపాయలు, అది కల్పించే ఉపాధేమో 250 మందికి మాత్రమే. రొయ్యల పెంపకం వలన జిల్లాలో దాదాపు 15వేలమందికి ఉపాధి లభిస్తుందని BFDA అసిస్టెంట్ డైరెక్టర్ చెపుతున్నారు కాని వీటివల్ల ఉపాధి కోల్పోతున్న మూడులక్షల మంది ప్రజల గురించి ఆయనేమీ ప్రస్తావించడంలేదు.

రొయ్యల పెంపకం వలన జరిగే దుష్పరిణామాల జాబితా యిదీ-

1. సంప్రదాయ మత్స్యకారుల నోట్లో మన్ను

2. ఆహారధాన్యాల కొరత

-రాష్ట్రంలో మంచినీటి సాగుకు లాయకైన 40 వేల హెక్టార్ల భూముల్ని యిప్పటికే రొయ్యలచెరువులుగా మార్చివేశారు. దీనివల్ల ఈ సంవత్సరం వరి దిగుబడి 2 నుండి 5 శాతం వరకు తగ్గవచ్చని అంచనా (గత సంవత్సరం యిది 99. 6 లక్షల టన్నులు). ఒక్క నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండంలోనే 137 హెక్టార్ల పంటపొలాలను రొయ్యల గుంటలుగా మార్చారు. దీనితో యిప్పటికే వున్న ఆహార కొరత మరింత తీవ్రం కానుంది.

3. నిరుద్యోగ మహమ్మారి

-వ్యవసాయం, చేనేతల తర్వాత ఎక్కువమందికి ఉపాధి కల్పించేది మత్స్యపరిశ్రమ. ఇప్పుడిది కూడా సంక్షోభంలో యిరుక్కుంటే నిరుద్యోగం ఎంత పెరుగుతుందో ఊహించవచ్చు.

4. ఉప్పు ఉత్పత్తి తగ్గిపోయింది.

- ఉప్పు పండించే భూములన్నీ రొయ్యల చెరువులుగా మారడం వలన జిల్లాలోఉప్పు ఉత్పత్తి 70 శాతం తగ్గింది. ఒకప్పుడు ఉప్పును ఎగుమతి చేసిన ఈ జిల్లా యిప్పుడు దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఈ పరిశ్రమపై ఆధారపడిన ఉప్పురైతులు, కూలీలు ఉపాధి కోల్పోయారు.

5. పచ్చదనానికి చిచ్చు

-తాటిచెట్లను కొట్టేయడం వలన చూద్దామన్నా ఒక్క చెట్టు కనబడడం లేదు. కల్లుగీత పనివారలు ఉపాధి కోల్పోయారు. తుఫాను నివారణకు ఉద్దేశించిన షెల్టర్‌బెల్ట్ పథకం కింది చెట్లను కూడా నరికేస్తున్నారు. ఇది ఎంత ప్రమాదరకమో అందరికీ తెలిసిందే. పదేళ్ళపాటు రొయ్యల చెరువుల్లో యిలాగే ఉప్పునీరు నిల్వ వుంచితే 15 కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి పంట పండదని, భూములు ఉప్పు ఎడారులుగా మారిపోతాయ ని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

6. నీటి సమస్య తీవ్రం

- రొయ్యల చెరువులు పెరిగేకొద్దీ ఊళ్లల్లో మంచినీటి వనరులు కృశించిపోతున్నాయి. బావులు, చెరువులు, కాలువలు అన్నీ ఉప్పునీటి మయమైపోవడంతో మైళ్ల దూరంనుంచి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోంది.

7. వాతావరణ కాలుష్యం

- 'రొయ్యలసాగు వలన ...వాతావరణంలో తేమశాతం పెరిగిపోయి నైట్రోజన్ వలయం విచ్ఛిన్నమై పోతుంది. బాక్టీరియా, వైరస్,ఫంగస్ పెరిగిపోయి రకరకాల శ్వాసకోశ, చర్మవ్యాధులు ప్రబలుతాయ'ని ఆక్వాకల్చర్‌లో వచ్చే వ్యాధులు, వ్యాధి నిరోధక నిపుణుడు ప్రొ. ఏ. పార్థసారథిగారి అభిప్రాయం. పంటలకు కూడా వైరస్ వచ్చే ప్రమాదం వుంది.

భారీ పెట్టుబడులు పెట్టగలిగిన అగ్రకులాలకు చెందిన పెద్దరైతులకు, కంపెనీలకు పెద్దఎత్తున లాభాల సమకూర్చడానికి తప్ప యింకెవరికీ ఏ విధంగాను ప్రయోజనకరం కానిది రొయ్యలసాగు అని ఈ పుస్తకం చాలా స్పష్టంగా తేల్చి చెపుతుంది. ప్రకాశం, కృష్ణా జిల్లాల్లోని పరిస్థితి గురించి కూడా రిపోర్టులు జతపరిచారు.

* * *

అంకెల విషయంలో పుస్తక ప్రచురణకర్తలు జాగ్రత్త వహిస్తే బాగుండేది. కొన్ని గణాంకాలు కూడితే లెక్కకు సరిపోకపోవడం పంగతి అలావుంచి చాలా గందరగోళపరుస్తున్నాయి. లాభాల ప్రలోభాల్లో పడి దెబ్బతింటున్న సన్నకారు, చిన్న రొయ్యలరైతుల గురించి కూడా చెప్పటం చాలా అవసరం. అలాగే కూలీలు ఎక్కువగా అవసరమయ్యే వరి పంట నుంచి ఒకరిద్దరికంటే ఎక్కువమంది అవసరంలేని రొయ్యల సాగుకు మారడం వలన పల్లెకారులు కాని యితర కులస్తులు కూడా ఎంత ఘోరంగా దెబ్బ తింటున్నారో వివరించి వుండాల్సింది. ఇలా జీవనోపాధి కోల్పోయిన స్త్రీల సంఖ్య చాలా ఎక్కువగా వుందని తమిళనాడులోని కొన్ని మహిళా సంఘాలు గుర్తించాయి.

ఈ దుష్పరిణామాలకు వ్యతిరేకంగా ప్రస్తుతం దళిత మహాసభ, పట్టపు మత్స్యకారుల పరిరక్షణ సమితి, మత్స్యకారుల పరిరక్షణ సంఘ, ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘాలు పోరాడుతున్నాయి. వారు ఈ సముద్ర దొంగల్ని తరమడంలో మనందరి సహకారాన్ని కూడా అభ్యర్థిస్తున్నారు.